

“క్షేత్రమే ప్రధానమంటావా? ఇంతకీ నువ్వు!” అన్నాడు సాంబయ్య కోట్లోనుంచి అంకపొగాకు చుట్టబయటికి తీసి సవరించుకుంటూ.

“అనుకోవాలా అంతే! మనుష్యులకి బీజం అంతే! క్షేత్రానికి లేని ప్రాధాన్యత విత్తుకు ఎక్కడ్నుంచి వస్తుంది? విత్తుపడటం ‘యాక్సిడెంట్.’ సారవంతమైన భూమి మాత్రమే దాన్ని మహావృక్షాన్ని చేయగలదు! ఇది శాస్త్రసమ్మతం సాంబయ్యగారూ!” అన్నాడు ప్రసాదరావు.

కత్తెరమార్కు సిగరెట్ గట్టిగా దమ్ముపట్టి పొగవదుల్తూ, ఎదురుగా పడక కుర్చీలో పడుకొన్న సాంబయ్య కళ్ళల్లోకి, ఆ కళ్ళవెనక దోబూచులాడుతోన్న ఏదో రహస్యాన్ని! వెదుకుతూ చూశాడు ప్రసాదరావు.

★

ఏభయ్యోపడిలో కాలుపెట్టిన సాంబయ్య, అరికాలెట్టుకొట్టి, మూడోపెళ్ళికి సత్యవతిని అగ్ని సాక్షిగా వివాహం చేసుకొని, పెళ్ళాన్ని తీసుకొని ఇంటికివచ్చాడు. సాంబయ్య మూడో పెళ్ళాన్ని వెంటపెట్టుకొచ్చిన రోజున మొదటి పెళ్ళాం చావిట్లోకి మకాం మార్పుగా, రెండోభార్య పుట్టింటికి

పెళ్ళింది. ఆ రోజునుంచీ సాంబయ్య ఇంట్లో వాళ్ళిద్దరి స్థానమూ, ఎండిపోయిన ఆకులు ఇంకా చెట్టుకు అంటిపెట్టుకొని, యిప్పటికో యింకా కాసేపట్లోనో రాలిపో పోయేలాగా మిగిలిపోయింది! వాళ్ళు చేసిన పాపం ఏమంటే సాంబయ్యతో పాతిక ముప్పై సంవత్సరాలుగా కాపురంచేసి కూడా ఒక్క వంశోద్ధారకుణ్ణి సాంబయ్యకు యివ్వలేక పోవడమే!

పెళ్ళాం బతికుండగా మళ్ళీ పెళ్ళి చేసుకోకూడదనే చట్టం రాబోతూన్న దని విన్న సాంబయ్య మూడో పెళ్ళి చప్పున చేసుకొన్నాడు.

దాదాపు ఎనభై యకరాల మాగాణీ, పసుపుతోటలూ, కొబ్బరితోటలూ, లంకంత ఇంటికీ వారసుణ్ణి తనకు పున్నామ నర కంనుంచి విముక్తి ప్రసాదించగల పుత్రుణ్ణి-తనమూడో పెళ్ళాం సత్యవతి అందించగలదని గాఢంగా నమ్మాడు సాంబయ్య. సత్యవతిని చేసుకోబోయే ముందు ఆమె జాతకం చూపించి, సంతానయోగం వుందన్న విషయాన్ని నిర్ధారణ చేసుకొన్నాడు. సాంబయ్య పెళ్ళాన్ని పువ్వుల్లో పెట్టి పూజచేయక పోయినా ఆమెకు ఏకొరత లేకుండా చూశాడు.

పుట్టింట్లో సరిగా కూడా దొరకని సత్యవతికి సాంబయ్య ఇల్లు స్వర్గంలా కనిపించింది. కోరిన తిండీ, బట్టలూ, నగలూ! ఇంకేం కావాలి? ఇవతల పుల్ల అవతల పెట్టేపనిలేదు! ఇంటినిండా పని మనుషులూ, జీతగాళ్ళూను! ఆ ఇంట్లో తన మాటకు ఎదురులేదు! తను నిజంగా రాణీవాసం చేస్తోంది. తనకేం తక్కువ?

తనకేం తక్కువ—? తనకేం తక్కువ?

సత్యవతి అంతరాంతరాల్లో తనకు తక్కువైనదేదో వున్నదని తెలుసుకొని బాధ పడేది.

సాంబయ్య తనపై వుంచిన బాధ్యతను గుర్తించిన సత్యవతి సంతాన యోగం కోసం శతకోటి దేవుళ్ళకూ మొక్కు కొంది.

రెండు సంవత్సరాలు గడిచినై.

కాని సాంబయ్య ఆశలు ఎండమావుల్లా దగ్గర కొచ్చినకొద్దీ దూరమవు తూవున్నాయి!

సాంబయ్య పెళ్ళాంచేత, శతవ్రత నోములు నోయించాడు. ఎన్నో వ్రతాలూ, శాంతులూ, సంతర్పణలూ చేయించాడు.

—అయినా సత్యవతి కడుపు పండ లేదు. సాంబయ్య పెళ్ళాంతో కలిసి ఆసేతు పుణ్యతీర్థాలు సేవించాడు. తిరు పతి కొండమీద ఏడుకొండలవాడికి నిలు వుదోపిడీ యిస్తానని మొక్కుకొన్నాడు.

—అయినా సత్యవతి కడుపున - నోములపంట - వంశోద్ధారకుడు వుద యించలేదు.

సాంబయ్య ఆశలు రానురాను నీర సించి పోతూన్నాయి. తన ఐదారు లక్షల ఆస్తికీ వారసుడూ, తనవంశాన్ని భూమ్మీద నిలిపేవాడూ, పితృదేవతల్ని పున్నామ నరకంనుంచి తప్పించగలవాడూ అయిన పుత్రుడు తనకు కలగడా? తనకు సం తానయోగం యిక లేనట్టేనా? సత్యవతి కూడా మిగతా వాళ్ళలాగా—!

అహోరాత్రిళ్ళూ సాంబయ్యకు ఇదే మధన—తన స్థానభ్రష్టత్వాన్ని లీలగా

పన్నెకొట్టిన సత్యవతి ఆరాటపడసాగింది. మూడు పెళ్ళిళ్లు చేసుకున్న సాంబయ్య నాలుగోదానికి మాత్రం ఎందుకు సాహసించడూ? తన ప్రాణంకూడా మిగతా ఇద్దరు పెళ్లాల్లాగానే వాడి ట్లోకో, పుట్టింటికో మారటం తప్పదని నమ్మక మేమిటి?

దప్పిక గొన్నవాడికి తడి నేల కనిపించి నట్టు సత్యవతి కడుపులో ఏదో అవమానం తగిలి సాంబయ్య చెవులో రాత్రిళ్లు ఊదేది! ఆనంద వివశుడై సాంబయ్య పెళ్లాన్ని అమాంతం ఆకాశంలోకి ఎత్తేసినంత పనిచేసేవాడు.

కాని ప్రకృతి సత్యవతిని ఎప్పుడూ చిన్న చూపే చూసింది.

మరి కొన్నాళ్ళు సత్యవతి వలయాన్ని ఎత్తుగా పెంచుకొని సాంబయ్య ముందు తిరుగుతూ అతన్ని సంతోషపెట్టి, తన భర్తకున్న ఆశల్ని ఎండి పోకుండా చూసుకొంది.

కాని ఆ నాటకం తను ఎన్నాళ్ళు ఆడగలదు? సత్యవతికి సాంబయ్యమీదా, తన నాటకం మీద విసుగు జనిస్తోంది.

సాంబయ్య మూడో పెళ్ళాంమీద పెట్టుకొన్న ఆశలు నిరాశలు కాగా, అతనిలోని 'అహం' కొద్ది కొద్దిగా దెబ్బ తింటూ వచ్చింది. భయంకరమైన, అసహ్యకరమైన ఊహాలు అతడి మెదడును చెదల్లాపట్టి పీడించ సాగినై.

తను నిండు యౌవ్వనంలో - ఇరవై మూడు ఇరవై నాలుగు సంవత్సరాల వయసు-రాళ్ళను బద్దలుకొట్టే వయసూ- భూమిని పగలదన్నే వయసులో వుండగా పెద్ద జబ్బున పడ్డాడు-ఏం జబ్బు? టైఫాయిడ్ - కాంప్లికేటెడ్ - అన్నాడు డాక్టరు!

ఆ రోజు రాత్రి తను దారుణమైన బాధపడ్డాడు-జ్వరం తిరిగి పోయింది-చెవులు దిబ్బళ్లు పడిపోయాయి-పీడ కలలా -భీభత్సం-పెద్ద గాలి వాన-వరదలు, పువ్వు మీరుకున్న కంకి చేను పూతంతా రాలి పోయింది! చేను చేనంతా దిబ్బగా-బోడి గా-బావురు మంటూ మూలుగొంది!

—ఎలాగో ఆ గండంనుంచి బయట పడి బట్టకట్టాడు.

కాని తన జన్మకు సార్థక్యం ఏమిటి? తన వంశోద్ధారకుడు-తన ఆస్తులకు-తన ఐశ్వర్యానికి వారసుడూ-తన తండ్రి తాతల రక్తాన్ని పంచుకొని—ఒక్కడు తనకు కలగలే!

ఆ వేదనలతో మగ్గిపోతోన్న సాంబయ్యకు అప్పుడిలా జతపడ్డాడు ప్రసాద రావు.

ఆంధ్రా యూనివర్సిటీ మెడికల్ ఆనర్సు ఫైనలు పరీక్షరాసి, వాల్తేరునుంచి వారంరోజుల క్రితమే ఇంటికివచ్చాడు ప్రసాదరావు.

ప్రసాదరావు ఇల్లు సాంబయ్యగారి ఇంటి ఎదురుగానే వుంటుంది. కొడుకు చదువుతో, అంతకుముందే గాడితప్పిన ప్రసాదరావు తండ్రి ఆర్థికస్థితి బోల్తా కొట్టింది. కోటి మందికసంతో ప్రసాద రావు తండ్రి సాంబయ్యగారి దగ్గర పాతికావరకూ అప్పు పుచ్చుకొంటూ చిన్నపనికీ పెద్దపనికీ సాయపడ్తూ వుండే వాడు. సాంబయ్య పెద్దభార్య పెత్తనపు

రోజుల్లో ఆ ఇంటికి బాగా రాకపోకలుం డేవి. ఇప్పుడు రెండు కుటుంబాలమధ్య అంత దోస్తీ లేకపోయినా, ప్రసాదరావు తండ్రిమాత్రం అప్పుడప్పుడూ సాంబయ్య దగ్గరకొచ్చి మంచీ చెడ్డా మాట్లాడి పోతూండేవాడు.

సాంబయ్యకు ప్రసాద రావంటే మంచి అభిమానంగా వుండేది. వాణ్ని చిన్నప్పట్నుంచీ తెలుసును. బుద్ధిమంతుడు; కుర్రాడు మంచి చురుకైనవాడు! తన ప్రోద్బలంవల్లే వాణ్ని పెద్ద చదువు లకు పంపించాడు తండ్రి.

ఆ మాటకొస్తే ఆఖరి సంవత్సరం ప్రసాదరావు చదువుకి కొద్దో గొప్పో సాంబయ్య సహాయం పడ్డాడు కూడా. ఊళ్ళో అంత పెద్ద చదువు చదువుకొన్న వాడూ, తెలివిగలవాడూ లేడని సాం బయ్య అభిప్రాయం. ఏదో ఒక రోజున ఏ జడ్జీగానో, కలెక్టరో అయిపోతాడని సాంబయ్య నమ్మకం.

ఇంత కట్నం యిచ్చి ఎవరన్నా పిల్ల నిస్తే ముందు అప్పులు తీరిపోతాయని ప్రసాదరావు తండ్రి ఆశ.

పరిస్థితులు అనుకూలించి ఎక్కడన్నా డబ్బు దొరికితే ఇంకో రెండు సంవత్స రాలు పైకాలేజీలో రిసెర్చిచేసి డాక్టరేట్ సంపాదించాలని ప్రసాదరావు ఆశ.

ప్రసాదరావు శెలవులకు ఇంటికొచ్చిన దగ్గర్నుంచీ ఇంట్లో కూర్చోవడం, తోచు బడిలేదు. ఎంతసేపని పుస్తకాలు చదవ డం? పైకాలేజీ-పైకాలేజీ-ఒక్కటే చదువు! తెలుసున్న విజ్ఞానం ఎందుకూ? ఎప్పటి కైనా డాక్టరేట్ కొట్టితీరాలి!

ఊరినుంచి వచ్చిన రోజున ప్రసాద రావు సాంబయ్యగారింటికి వెళ్ళి మామూ లుగా కనపడి వచ్చాడు. సాంబయ్య తనంటే ఎంతో ఆదరం చూపాడు. ఆయన మూడో పెళ్ళాం సత్యవతికూడా చాలా మంచిదిలాగానే వుంది.

తను సాంబయ్యగారితో మాట్లా డుతూ కూర్చున్న కాసేపట్లోనే, లోపల నుంచి ఎన్ని పలహారాలు వచ్చాయి— పాలకోవా, ఉప్మా, కాఫీ, మామిడి పళ్ళూ - తను కలవు తీసుకోకపోతే 'వస్తూవుండవోయ్ ప్రసాదం! ఇంటి దగ్గర కూచుని ఏంచేస్తావ్?' అన్నాడు సాంబయ్య. కాని తను వెళ్ళలేదు, రెండో రోజంతా. మూడోరోజు సాయంకాలం తను ప్రయత్నం చేసుకొని బయటికి పోతూం టే - వాకిట్లో ఆవిడ - సత్యవతి కనిపిం చింది! నిజంగా సత్యవతి అంత 'అంద గత్తె' అని తను అనుకోలేదు. నిండు యౌవ్వనం - చిలిపికళ్ళూ - తనవైపు ఎం దుకు అంత అల్లరిగా చూశాయి? తనకు ఏమిటో అంతా ఇదిగా అయిపోయింది. సత్యవతి సాంబయ్య భార్య! సాంబ య్యను త ం డ్రి లా గౌరవించాడు! అయినా సాంబయ్య - ముసలాడు - వాడికి మూడోపెళ్ళి ఎందుకూ? అందు లోనూ - అంత యౌవ్వనంలోవున్న అంత చక్కని ఆడదా?

అయినా తనకెందుకు ఆ గొడ వంతా? సాంబయ్య బాగుంటేనే మనిషి! పిలుపిస్తే ఎంత పనైనా చేయించ గలడు! నలుగుర్లో నగుబాటు! ఊళ్ళో వ్యవహారం! దానికి తగ్గట్టు వాడిల్లు తగ లెయ్యా, అదోక ఒంటిస్తంభం మేడ

అంతకంటే అన్యాయం!! ఇక సాంబయ్య పరేసరి! మోయాల మరాతి! అంతకంటే ప్రమాదం! మోయాలమరాతి పొట్టకంటే సాంబయ్యపొట్ట పెద్దది! వాడి మీసాలకంటే సాంబయ్య మీసాలే పెద్దవి!! వాటే సాంబయ్యకళ్ళల్లో ప్రకాశాన్ని చూడలేకండడు. అంతేకాదా!

- పుట్ట గొడుగుల్లా లేచిన అతని కోరికల్ని అణుచుకోవడానికి ప్రయత్నం చేశాడు ప్రసాదరావు.

మర్నాటి ఉదయం సాంబయ్యగారు ప్రసాదరావును రమ్మని కబురుపెట్టాడు.

ప్రసాదరావు అద్దరలో మూసేసిన పుస్తకం మళ్ళీ తెరచినట్టయింది.

'నిన్న సాయంకాలం సత్యవతి అల్లరి చూపులూ-చిలిపినవ్వూ-ఇప్పుడు సాంబయ్యగారి పిలుపూ' దీనికర్థం ఏమిటి తెలుసు లేదా? అనుకొన్నాడు. సాంబయ్య జీవితం అతని కళ్ళముందు కదిలింది!

అప్పుడు-తన అనుమానాలకు ఆధారం లేక పోలేదు. ఇది మన సత్య శాస్త్రానికి విరుద్ధం కాదు! పిలుపును అందుకొని సాంబయ్య ఇంటికి వెళ్ళాడు ప్రసాదరావు.

అది మొదలు ప్రతిరోజూ ఉదయం భోజనాలు అయాక, సాయంకాలంనుంచీ రాత్రి భోజనాల వేళదాకా ప్రసాదరావుకు సాంబయ్యగారితో కాలం క్షేపం జరిగిపోతోంది.

ఊళ్ళో విషయాల దగ్గర్నుంచీ అంతర్జాతీయ రాజకీయాల వరకూ అనర్గళంగా మాట్లాడేస్తుండగా సాంబయ్యగారు అంత పొగాకు చుట్ట కాలుస్తూ, మధ్య మధ్య తన అభిప్రాయాల్ని సంకేతాల రూపంలో ప్రసాదరావు మీదకువదులుతూవుండేవాడు.

వేదరు శాస్త్రంతో మొదలయే సంభాషణ, రాష్ట్రీ రాజకీయాల దాకా పోయి కుటుంబ వ్యవహారాలతో ముగిసేది. అప్పుడప్పుడూ సాంబయ్యగారు పురాణాలూ, వేదాంతాల్ని గురించి మాట్లాడేవాడు. మధ్యమధ్య ప్రసాదరావు 'వివాహమూ-సంతానమూ-' మీద తన అభిప్రాయాల్ని తెలియ చేసేవాడు.

రోజులు గడుస్తున్న కొద్దీ ప్రసాదరావు తెలివికలవాడులాగా, 'నమ్మకస్తుడు'లాగా కనిపించాడు సాంబయ్యకు. సాంబయ్య 'తోకకొస్తున్నట్టు'గా తోచింది ప్రసాదరావుకు.

★

ఒక రోజున—

వ్యవసాయశాఖా యస్పెక్టర్ చూసి వచ్చిన సాంబయ్యతో ఆ మాటా యీ మాటా మాట్లాడుతూ ప్రసాదరావు,

'విత్తుకంటే క్షేత్రమే ప్రధానం!' అని తేల్చి చెప్పాడు. సాంబయ్య అంత పొగాకు చుట్ట నోట్లోనుంచి బయటకుతీసి మీసాల సందుగా ఓ చిరునవ్వు ప్రసాదరావు మీదకు విసిరేశాడు.

'పేక గాలం దగ్గరకు వచ్చింది!' ముసి ముసి నవ్వులు నవ్వుకొంటూ మనసులో అనుకొన్నాడు ప్రసాదరావు.

'ఇదుగో! కాఫీ అయిందా?' ఇంట్లోకి కేక వేశాడు సాంబయ్య!

'ఆఁ తెస్తున్నా!' సత్యవతి రెండు గ్లాసులనిండా కాఫీ తెచ్చి యిద్దరి మధ్యా పెట్టింది. లోపలకువెళ్తూ వెనక్కు తిరిగి సాంబయ్య భుజాలమీదుగా ప్రసాదరావువంకచూస్తూ ఒక చిరునవ్వు విసిరింది

ప్రసాదరావు కాఫీ గ్లాసులోకి చూస్తూ మందహాసం చేశాడు.

'ఏమిటి ప్రసాదూ! కాఫీలో ఏమున్నాయేంటా!' అన్నాడు సాంబయ్య కాఫీ ఓ గుటక వేసి.

'ఆఁ. ఆఁ! ఏమీ లేదు!' అంటూ ప్రసాదరావు కాఫీ గ్లాసు పెదవులకు అందించుకొన్నాడు.

కాఫీ తాగుతూన్న ప్రసాదరావును పరీక్షగా చూశాడు సాంబయ్య.

సన్నగా, చక్కగా వుండే ప్రసాదరావు కళ్ళల్లో ఆకర్షణ వుంది. పాలి పోయినట్టు వుండే ముఖానికి ఆ కళ్ళు, నల్లటి నొక్కులజుట్టూ, ఎత్తైన ముక్కూ కొంత అందాన్ని కలిగిస్తూ వుంటాయి.

మనిషి చూస్తే పిట్టంతవున్నా ఎంత చదువుకొన్నాడు-ఏం తెలివి తేటలు!

'అందుకే చదువు మూడో నేత్రం అన్నారు పెద్దలు!' సాలోచనగా అన్నాడు సాంబయ్య.

'ఆ జేవన్న మాటలేంటి! అనుభవం కంటే మించిందేముంది? తమకు తెలియంది మాలాటి చదువ్రాళ్ళకు తెలుస్తుందా?' అంటూ ప్రసాదరావు లేచి నుంచున్నాడు.

'సాయంకాలం పెందలాడేరా. బ్రహ్మచారివి ఏం పనుంటుందిలే?' పక పక నవ్వుతూ అన్నాడు సాంబయ్య.

ప్రసాదరావును సంతోషంతో వళ్ళు పులకరించిపోయింది. సాంబయ్య మాటల్లో అంతరార్థం ఏమిటి?

"అలాగే!" అంటూ ఇంటికి వెళ్ళి పోయాడు ప్రసాదరావు.

★

కనుచీకటి పడుతూండగా ప్రసాదరావు బాగా ముస్తాబయి సాంబయ్య ఇంటి ముందుకొచ్చి తలుపుకొట్టాడు.

ప్రసాదరావు లెఖ్ఖ ప్రకారం సత్య వతివచ్చి తలుపుతీయాలి! చాలావరకు కల కథను కట్టుకొన్నాడు. హీరోయిన్ ఇక రంగంమీదకు రావాలి!

'తలుపుతీసి నుంచున్న సత్యవతిని అలా చెయ్యిపట్టుకొని అలా అలా మెల్లగా రాసుకొంటూ లోపలకు—'

అంతలోనే తలుపులు తెరుచుకొన్నై!

ముందుకుసాగిన ప్రసాదరావు చెయ్యి అప్రయత్నంగా వెనక్కువచ్చింది!

"రావోయ్! ప్రసాదూ" అన్నాడు సాంబయ్య. ప్రసాదరావు గాలి బిగపట్టి సాంబయ్య వెనకే లోపలికి వెళ్ళాడు.

'ఇవ్వాళ్టితో యీ సాంబయ్య వ్యవ హారం తేలో తేల్చి వేయాలి' అనుకొన్నాడు కుర్చీలాక్కొని కూర్చుంటూ ప్రసాదరావు.

అంతలో రేడియోలో తెలుగులో వార్తల ప్రసారం ఆరంభమైంది. ఇద్దరూ మౌనంగా విన్నారు.

"ఐతే ప్రసాదరావ్! ఆమెరికానుంచి గోధుమవిత్తనాలుతీసుకొచ్చి మనదేశంలో పంటలు పండించాలంటున్నారు గదా? అవి ఎట్లయినా మన గోధుమలంత శ్రేష్ఠంగా వుంటాయా?" అన్నాడు సాంబయ్య.

“అంతకంటే ఇంకా బాగుంటాయి కూడా. ఆ బలమైన విత్తనం మన సార వంతమైనభూమిలో పడితే చాలా గట్టి పంట రాలుతుంది!”

విత్తనాలమార్పూ, చెట్లకు అంట్లు కట్టడమూ కొత్తరకాలైన విషయాలమీద ఆసక్తికరంగా ఓ బుల్లి ఉపన్యాసంచేశాడు ప్రసాదరావు.

“అవునోయ్! ప్రసాదూ — యీ కాలంలో అన్నీ కొత్త పద్ధతులే. పాపాల పద్ధతిలో పరిపాలనంట—ఇప్పుడొకటి తెలిసింది చూడూ” అన్నాడు సాంబయ్య.

ప్రసాదరావు సాంబయ్య ధోరణికి నిరుత్సాహ పడ్డాడు. తన మాటలకు మక్కీకి మక్కీ అర్థంతీసుకొంటున్నాడు. పట్టిదున్నపోతు! పిసరంతకూడా సైకాలజీ తెలియదు. తన మాటల వెనకున్న అర్థమేమిటో సాంబయ్య అర్థంచేసుకొని చావడంలేదు.

గోధుమలు ఎలాపండిస్తే తనకేం, వరి సాగు ఎలాచేస్తే తనకేం!

సాంబయ్యకు అర్థమయే ధోరణిలో సంభాషణ లాగటానికి ప్రయత్నం చేస్తూ అన్నాడు ప్రసాదరావు -

‘మన పురాణాలే ఘోషిస్తున్నాయి కదండీ! పాండవులు ఐదుగురిలో పాండు రాజుకు పుట్టిన వాడెవడన్నా వొక్కడు న్నాడా చెప్పండి! యమధర్మరాజూ, ఇంద్రుడూ, వాయుదేవుడూ, సూర్యుణ్ణి ఆరాధించి కదా కుంతీదేవి సంతానాన్ని పొందినది! అయినా పాండవేయులు అంటున్నారా లేదా?’

సాంబయ్య నోటిలో చుట్ట బయటకు తీసి, ఖాండ్రించి ఊసి, కళ్ళు అర్థయుక్తంగా తిప్పుతూ తిప్పుతూ-

‘వాస్తవం అంతేలే. కాని చూస్తూ చూస్తూ మనసొప్పదుగా!’ అన్నాడు సాంబయ్య.

‘మనకుంటే మార్గంలేదా? మనిషి తలుచుకుంటే చేయలేంది ఏముంది?’ ఇనుం కరిగినప్పుడే వంగ దీయాలి! మనస్తత్వ శాస్త్రం చదివిన ప్రసాదుకు వొకరు చెప్పాల్సిన పనిలేదు.

‘ఇనా మంచీ - చెడూ - మనమూ-’ అంటూ సాగదీస్తో సాలోచనగా అన్నాడు సాంబయ్య.

‘మంచీ—చెడూ అనేది మన మనసులోవున్నదే! వాస్తవానికి ఆ రెండూ ప్రపంచంలో విడివిడిగాలేవు!’ వేదాంతిలా ముఖంపెట్టి ఇంటి కప్పుకేసి చూస్తో అన్నాడు ప్రసాదరావు.

‘ఆహాఁ! ఆహాఁ. ఏం మాట న్నావోయ్, గొప్ప వేదాంతిలా అన్నావ్!’ సాంబయ్య మీసాల్లోంచి చిరునవ్వు దూసుకుపోయింది. ఒక క్షణం పాటు సాంబయ్యకళ్ళు ప్రసాదరావు ముఖంలో ఏదో చదవడానికి ప్రయత్నం చేసినై.

“వెళ్ళొస్తానండీ!” అంటూలేచి నుంచున్నాడు ప్రసాదరావు.

“జాగ్రత్తగానుండు! ఒక్కమాట!” గంభీరంగా అన్నాడు సాంబయ్య.

చెప్పొద్దూ! ప్రసాదరావుకు కొంచెం గుండెలు జలదరించినై.

"ఇదిగో - కాసిని మంచినీళ్ళు తీసుకు రా" గదిలోకి తొంగిచూసి పిలిచాడు పాంబయ్య.

సత్యవతి దోసకాయ చెంబునిండా నీళ్ళు తీసుకొచ్చి భర్తచేతి కందించి వాకిట్లో తలుపుచాటుగా నుంచుంది.

చెంబునీళ్ళూ గడగడా తాగి అన్నాడు - "ఓయ్! ప్రసాదూ—రెండు రోజులపాటు మా ఇంటిదగ్గర కనిపెట్టి ఉండాలి! నేను రేపు ఉదయం తొమ్మిది గంటలబండికి మద్రాసు అర్జంటుగా వెళ్ళాలి! మన గ్రంథాలయం బిల్డింగ్ కట్టించటానికి కావాల్సినఇనపసామానులూ, వాటికి ముందుగా ఖరీదు చేయాలి!"

"ఊఁ!" అన్నాడు ప్రసాదరావు, శరీరం గాలిలో యీదుతున్నట్టుగా అనిపించి.

'ఊఁ. అంటేకాదు! ఇల్లు జాగ్రత్తగా చూసుకోవాలి! దొంగల కాలం గావుంది! సొంతఇల్లుగానే చూసుకోవాలి సుమా!'

'సరే! అల్లాగే!' అన్నాడు ప్రసాదరావు. తలుపువెనక చీకట్లో గాజుదగ్గా - గాజుల గలగలా వినపడింది—

ప్రసాదరావు పాంబయ్యగారి దగ్గర శలవుపుచ్చుకొని ఇంటికి వెళ్ళాడు.

ఆ రాత్రి ప్రసాదరావుకు సరిగా నిద్ర పట్టలేదు! ఎందుకు పడుతుంది మరి?

★

తెల్లవారింది—సూర్యుడు మామూలుగానే తూర్పు దిక్కునే ఉదయించాడు! లేక అతడి సామ్యం పోయింది! ధర్మం ఎట్లాపడిస్తే తనకేం పోయింది! పైగా మామూలుకంటే ఉత్సాహంగా వున్నాడు. భూమిమ్మీద యీరోజు ఏం వింతలు జరుగుతాయో చూడాలనే క్యూరియాసిటీలో వున్నాడో ఏమో పాపం! మబ్బులులేని నీలి ఆకాశంలోంచి తెల్లటి ఎండ పాంబయ్యగారింటి వీధి అరుగుమీద పడుతోంది.

అరుగుమీద - వంటిమీద చొక్కాకూడా లేకుండా - కూర్చొని పాంబయ్య బొజ్జుం కదుపుకుంటున్నాడు. అప్పుడే పెయ్య ఒకటి తోకపైకెత్తి బెదిర మందులోంచి వీధిలోపడి పరుగెత్తుకు రావటం పాంబయ్య చూశాడు. దాని వెంట పలుపుపట్టుకొని చిద్రుగా వెనక్కి లాగుతూ దానితోపాటు పరుగెత్తుకొస్తున్నాడు భద్రయ్యగారి జీతగాడు.

'ఏయ్! ఏయ్! ఆగు! ఆగో!' వెనకబడి అంటూ జీతగాడు వస్తున్నాడు.

'ఎక్కడికిరా - నరిసిగా?' అడిగాడు పాంబయ్య.

'మందలోకు అండీ' అన్నాడు నరిసిగాడు.

'మందలోకెందుకురోయ్?'

'ఓస్! మనూరెద్దు పొట్టి కొట్టాని దండీ. ఇప్పటికి రెండు పార్లయింది ఇక్కడ! కట్టివుంచలే?'

'అందుకని—?'

'అందుకని మా భద్రయ్యగోరు మందలో తోలుకుపోయి కలుపుకు రమ్మన్నారు! మందూరు అంబోతూ మా బొనగా దొడ్డు తెండీ!'

అని పెయ్య రంకెవేసి దొక్క దూకు దూకి పరుగు అందుకుంది. పలుపు పట్టుకొని వెనకే పరిగెత్తాడు నరిసిగాడు.

సాంబయ్య కమురోతులు మడిచేసి తొవలు విరుచుకొని దూరంగా-మందహాసం చేసి పోతోన్న తిరగాడిని, అప్పుడైన్యనా తీక్షంగా చూస్తో బాలాసేపుగూర్చున్నాడు.

'ముఖం కడుక్కోవటం అయిందా? కాఫీ తీసుకు రమ్మంటారా?' మధుర మధురంగా వినిపించింది సత్యవతి కంఠం.

'ఆఁ, వస్తోన్నా!' ఏదో లోకం నుంచి బయటపడిన వాడిలా అంటూ లేచి, భార్యవెనకే లోపలికి వెళ్ళాడు సాంబయ్య.

కాఫీ తాగుతూ—"పెట్టె బెడ్డూ అంతా సర్దావా? తొరగా కానియ్యండి! బండి టైం అవుతుంది! పొగాకుచుట్ట పెట్టెలో పెట్టండి! మర్చి పోయేరూ!" అన్నాడు సాంబయ్య.

★

మద్రాసు పాసింజరు పొగలుచిమ్ముతూ కొంటూ వచ్చి స్టేషన్లో ఆగింది! సాంబయ్యగారి తిరగాడూ, రైల్వేకూలీ కలిసి సామాను సెకండ్ క్లాస్ పెట్టెలో సర్ది పెట్టారు. సాంబయ్యగారు బండిలో ఎక్కి తలుపుదగ్గర నిలబడి ప్లాట్ ఫారం అంతా ఆతృతగా పరికించాడు—

గ్లాస్కోపంచ, ఖద్దరులాల్చీ తొడుక్కొని, సన్నగాదువ్విన క్రాఫూ, సన్నగా పల్చగావున్న ప్రసాదరావు పెళ్ళి కొడుకులా ముస్తాబయి ఒకచేత్తో పుస్తకం, రెండోచేత్తో కత్తిరపాక్కు సిగరెట్ పట్టుకొని హుందాగా సాంబయ్య గారెక్కినపెట్టె వెతుక్కుంటూవచ్చాడు.

"ఏం ప్రసాదూ! ఇంత ఆలశ్యం! బండి కదిలేటైం అయితేను! రా! రా!" అన్నాడు సాంబయ్య.

"దారిలో మా ప్రొఫెసర్ గారబ్బాయి కనిపిస్తే మాట్లాడుతుంటే ఆలశ్యం అయిపోయింది! ఇంకా నయం బండి వెళ్ళి పోలేదు! కొంచెం ఆలశ్యమయితే మిమ్మల్ని చూట్టానికే అవకాశం వుండేదికాదు!" ఏదైన అత్యవసర విషయాలు చెప్పాలేమోనని ముఖంలో ముఖం పెట్టి అన్నాడు-ప్రసాదరావు.

గార్డ్ విజిల్ వేశాడు! ఇంజన్ కూత కూసింది! 'ఇంకా నయం: నమస్కారానికి వచ్చావ్ లే! ఊఁ ఎక్కూ! బండి కదులు తోంది!' అంటూ ప్రసాదరావును రెక్క పట్టుకొని కంపార్టుమెంట్ లోపలికి గుంజాడు సాంబయ్య-

'నే - నెక్కడికీ—?' విస్తుపోయి అన్నాడు ప్రసాదరావు.

'మద్రాసే కోయ్! మాడోలోవాళ్ళా తిరిగి వస్తాంలే!'

బండి కదిలింది - మెల్లిగా పాకిపోతోంది! కంఠం పెకలించుకొని హీన స్వరంతో అన్నాడు ప్రసాదరావు-

'మరి ఇంట్లో - ఇంట్లో ఎవరూ? ఎవరూ—?'

'ఆఁ ఏం? వాడున్నాళ్లే భీమయ్య! అంతా చూసుకొంటాళ్లే!'—నొసట పట్టిన చెమట తుడుచుకొంటూ కిటికీ గుండా చెయ్యి బయటికిచూపి చూపుతూ అన్నాడు సాంబయ్య.

ప్లాట్ ఫారం మీదున్న బాదంచెట్టు కింద చిన్నబైకా సల్లరాతి గోండులా-నుద్దెక్కిన కండలు పెరిగిన విశాలమైన ఛాతీ, గిరజాల జుట్టూ, కోడె తాచులా కోరమీసంతో ఆకోతలా-మందహాసం ఆపుకొంటూ నిలుచున్న తిరగాడ్ని-భీమయ్యను చూసేసరికి ప్రసాదరావు కళ్ళు అతని తలలో గిర గిరా తిరిగై. ★